వరకట్నం మొదలైన వాటిని గురించి అక్కడ సంబాషణ మొదలైంది అని చెప్పుకోవటం కన్నా ఆ తరువాత జరిగిన సంఘటనలే ఇక్కడ ముఖ్యం

★ ★ ★ ★

రెండు రోజులు గడిచాయి ఆ రోజు రామం ఆఫీసుకి అతని పేరు మీదుగా లేఖ వచ్చింది విప్పి చూసాడతను ముద్దొచ్చే గుండ్రటి అక్షరాలో వుంది లేఖ వచ్చింది సీత నుంచి – రామానికి అతడు చదవటం ప్రారంభించాడు ఆశ్చర్యంతో, ఆనందంతో

రామంగారికి

నమస్తే మీతో ఒకసారి మాట్లాడాలి '–' తేదీ సాయంత్రం పార్కుకి రాగలరా? ప్లీజ్

మీ,
సీత

తేరుకుని కొద్ది క్షణాల తర్వాత ఆ రోజు తేదీ చూసాడు రామం రెండూ ఒక్కటే!

సాయంకాలం అయ్యింది

పార్కులో నిలబడ్డ రామానికి భువనమోహనంగా ఎదురైంది సీత అని అంటే దాంట్లో అతిశయోక్తి ఏమీ లేదని నిరాపూటంగా చెప్పవచ్చును

అలా కూర్చుందామా! అడిగింది సీత

రండి

మౌనంగా సమయం గడిచింది వారిద్దరి మధ్యా కొన్నిక్షణాల పాటు

చెప్పండి గడ్డి పరకను త్రుంచుతూ అన్నాడు రామం, సంబాషణకు నాందీ వాచకం పలుకుతూ నిశ్శబ్దాన్ని బేదిస్తూ

సీత తలెత్తి చూసింది

ఐ హేట్ యూ ఐ హేట్ యూ రామం తడబాటు లేకుండా సూటిగా వచ్చిందా మాట

మిన్ను విరిగి మీద పడ్డట్టు అయ్యింది రామానికి

సీత తిరిగి కొనసాగించింది ఆమె ఒక్కొక్క మాటా ఒక్కొక్క వాక్యం తూటాగా మారి అతని హృదయంలోకి దూసుకు వెళ్ళింది

పెళ్ళి చూపుల దినాన ఎంతగా సంతోషించానో తెలుసా రామం? కాలేజీలో వరకట్నం దురాచారాన్ని తీవ్రంగా ఖండించిన రామం నా భర్త కాబోతున్నా



డంటే ఎంతగా సంతోషించానో? కానీ నా సంతోషం ఒక్కక్షణం పాటు కూడా నిలవలేదు ఆతర్వాత కట్నం చాలదని ఇంకా ఎక్కువ కావాలని అడుగుతూంటే మీరు నోరు మూసుకుని దిష్టి

బొమ్మలా కూర్చున్న దృశ్యం ఇంకా నా కళ్ళ ముందు తిరుగులాడుతూంది రామం

రామానికి కళ్ళు తిరిగినాయి

సీతా! నేను కట్నం విజ

ప్లీజ్! రామం, నన్ను రెండు నిముషాల పాటు మాట్లాడనివ్వండి యువతీయువకుల సహకార సహృద్భావంతో నే ఈ సమస్యని రూపుమాపగలమని సభల్లో బల్ల గుద్దేవారో? దీరోదాత్తంగా మాట్లాడేవారో? సమాజ వికాసానికి యువతరం యుగవైతాళికులన్నారో? యువత లేనిదే నవత లేదన్నారే? మానవత అసలే లేదన్నారే? జీవితంలో వసంతం లేదన్నారే? ఎక్కడండీ మీ నవత? మానవత? సభల్లో ప్రతిజ్ఞ పట్టారే కట్నానికి అమ్ముడు పోనని?

సీతా ప్లీజ్ నన్ను మాట్లా

' ఆగండి ఇంకా నేనడిగిన రెండు నిముషాలు పూర్తి కాలేదు మీ మాటలను నమ్మి వుదాత్త వ్యక్తిఅనుకున్నాను కాని నా నమ్మకం పటాపంచలైపోయింది సార్! కాలేజీల్లో మీరిలా మాట్లాడే వారని ముందే తెలియక పోయినా, మా అమ్మానాన్నల మాటలకు తల ఒగ్గి పెళ్ళికి తలవంచి వుండేదాన్నేమో! కాని ఇప్పుడు మాత్రం కాదు రామం ఆచరణలో పెట్టలేని ఆశయాలను ఇకమీదటైన విడిచి పెట్టండి- దయచేసి ఐ హేట్ యూ ఫార్ దిజ్ రీజన్ బట్ ఫార్ నతింగ్

సీతా! నా మాట విను నేను కట్నం తీసుకుంటూన్నది

సారీ రామం నేనడిగిన రెండు నిముషాలు ముగిసిపోయాయి గుడ్ బై చక చకా అడుగులు వేసింది సీత, వెనుక నుంచి రామం ఎంతగా పిలుస్తున్నా వినిపించుకోకుండా

రామం ముఖాన కత్తివాటుకు నెత్తురు

# 'ఆడవాళ్ళూ మీకు జోహార్లు'

చుక్కలేదు

ఒక్క నిముషం

ఒక్క నిముషం సమయమామె యిచ్చి వుంటే అతను చెప్పగలిగి వుండేవాడు తానెందుకు కట్నం కోరుతున్నాడో

★ ★ ★ ★

వివరంగా లేఖ రాసాడు రామం సీతకి పంపించాడు ఆ లేఖని లెటర్ చదివైనా తనని అర్థం చేసుకుంటుదేమోనన్న ఆశకి ప్రయత్నరూపం అది ఆ ఆశా ఆడియాసే అయ్యింది

అతడు పంపించిన లెటర్ విప్పి చదవకుండానే తిరిగివచ్చేసింది అతడి మనసు కకావికలమై పోయింది

తన మనస్సు, తప్పొప్పుల్ని పట్టించుకునే స్థితిని దాటిపొయ్యేదాకా ఆలోచించాడు వాడు

ఇంక ఒక్కటే మార్గం మిగిలి వుంది అదీ ప్రయత్నించి చూడదలిచాడు స్త్రీ హృదయం స్త్రీకైనా అర్థమవుతుందేమోనన్న ఆశ

రమారమి ఒకే ఈడు కలిగిన స్త్రీలకైనా

అతడు చేసిన పని పట్నంలో వున్న చెల్లెలికి లేఖ రాయటం

విజయా!" అంటూ ప్రారంభించి విషయాలను తెలియబరుస్తూ దీంట్లో నేను తప్పుగా ఆశించిందేమిటి తల్లీ? చెల్లెలు పెళ్ళి, కట్నం మూలంగా ఆగిపోకూడదన్న నా వాంఛ తప్పా? నా ఆశయాలను చెల్లి శ్రేయస్సు కోసం మార్చుకున్నాను నీ పెళ్ళి కోసం, నీకు వచ్చే మొగుడికి కట్నం యివ్వడం కోసం ఇలా కోరానే తప్ప, వేరే ఏ విధమైన లాభాన్ని ఆశించికాదు వరకట్నం దురాచారమన్న అభిప్రాయం నాకిప్పటికీ వుంది ఎప్పటికీ వుంటుంది కానీ నా చుట్టూ వున్న పరిస్థితులకి, సమస్యలకి నేనెలా పరిష్కారాన్ని చూపించగలను?

నన్ను అర్థం చేసుకోవూ? అని రాసాడు వివరంగా

వారం రోజుల తరువాత సమాధానం వచ్చింది లేఖకి ఈ వారం రోజులుగా మదనపడుతున్న రామం తటాలున విప్పి చదివాడు లేఖని

అన్నయ్యా,

నీ లెటర్ చూసి ఎంతగా దిగ్భ్రాంతిచెందానో తెలుసారా? అసలు నువ్వు ఇన్నేళ్ళ సహచర్యంలో నన్ను ఏమని అర్థం చేసుకున్నట్రా? ఓ విషయం తెలియకడుగుతాను ఆశయాలన్నవి మీ మగవాళ్ళకేనా? ఆడవాళ్ళకూ వుండవా? నేనూ నీ చెల్లినేరా నీకున్నపాటి ఆశయాలు నాకెందుకు వుండకూడదు? కట్నం తీసుకోనన్నది మగవాడి ఆశయమైతే కట్నం తీసుకునే వ్యక్తిని పెళ్ళాడనన్నది స్త్రీల ఆశయం కావాలని సభల్లో ప్రసంగ చేసేవాడివి ఆ ధైర్యం ఎక్కడ్రా నీలో ఇప్పుడు?

ఇప్పుడు చెబుతాను విను కట్నం తీసుకోబోయే మగవాణ్ని నేను ఏ కోశానా పెళ్ళిచేసుకోను ఇది నీ కోసం తీసుకున్న నిర్ణయమ్కాదు ఇది నా జీవితాశయం నేను ఎప్పుడో తీసేసుకున్న నిర్ణయం కూడా

ఇప్పటికైనా తెలుసుకోరా అన్నయ్యా మాకూ కొన్ని ఆశయాలు వుంటాయని

ఒక్కసారి ఈ విషయమై నన్ను కలిసి వుంటే ఇంత ట్రేజడీకి అంకురార్పణే జరిగి వుండేది కాదు అడగరు మీరు చిన్నమ్మాయి ఆమెకేం తెలుసులే అనుకుంటారు సీత వదిన చేసింది రైటే నా వరకు

ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు సీతకి నేనే లెటర్ రాస్తాను నువ్వూ ఆమెతో మాట్లాడు ఎలాగైనా ఆమె అడ్రస్ రాస్తావు కదూ? కట్నం సంగతికే గుడ్‌బై కొట్టేయ్

ఇక మీదటైనా ఇలాంటి కుంటి సాకులకు దూరంగా వుంటావు కదూ? అదిగో నీ కళ్ళలో నీళ్ళు సుడి తిరుగుతోంది తుడుచుకోరా వాటిని

ఐ విష్ యూ ఎ హేపీ మారీడ్ లైఫ్

నీ ప్రియమైన చెల్లి,

విజయ

అవి ఆనంద బాష్పాలె కదూ రామం కంటినుండి జాలు వారుతున్నది?

నిజమే! ఆశయాలన్నవి తనకొక్కడికే వుండాలనుకోవటం శుద్ధ పొరపాటు ఎంత బాగా అర్థం చేసుకున్నావు విజయా నన్ను మనసులో అనుకున్నాడు రామం ఒక్క కన్నీటి బిందువు ఆ లేఖ మీదికి జాలువారింది

దృఢ చిత్తంతో లేచాడు రామం

–కాబోయే శ్రీమతితో మాట్లాడడానికి

–కళ్ళు తెరిపించిన చెల్లికి లేఖ రాయడానికి. □

